12న జగనన్న కాలనీల్లో గృహప్రవేశాలు

మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్ల కైలాసగిరి కొండ సమీపంలో నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీ నూతన గృహ ప్రవేశాలు ఈనెల 12న ప్రారంభించనున్నట్లు హౌసింగ్ పీడీ వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద్, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణా రావు, రాజ్య సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఉమ్మడి జిల్లాల జిల్లాపరిషత్ చైర్మన్ కత్తెర హెనిక్రిస్టినా, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరరావు, తహసీల్దారు శ్రీనివాస శర్మ, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, హౌసింగ్ ఏఈ దివ్య పాల్గొన్నారు.

పార్టీలో చేరుతున్న వారికి సముచిత స్థానం కల్పిస్తాం

ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్లరూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా బల హీన వర్గాల రాజకీయ ఎదుగుదలే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన నచ్చి పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తానని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. నవరత్న పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించటమే కాకుండా నియోజకవర్గంలోని ప్రతి సామాజిక వర్గానికి రాజకీయంగా సముచిత స్థానం కల్పించానని, రానున్న రోజుల్లో మరిన్ని బడుగు, బలహీనవర్గాల కులాలకు రాజకీయంగా ఉన్నత స్థానాన్ని కల్పిస్తామని హామీనిచ్చారు. తమ కుటుంబం పై నమ్మకంతో పార్టీలో చేరిన వారికి మంచి భవిష్యత్ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. టీడీపీని వీడిన మేకల బాలరాజు, మేకల రాజయ్య, పెద్దిరాజు, మల్లయ్య, ముత్యాల అంజి, జటావత్ శివ, కొర్రా చిన బాలు, రమావత్ అఖిల్, కొర్రా హనుమా నాయక్, జటావత్ రంగా, మేకల శ్రీను తదితర 20 కుటుంబాల వారు ప్రభుత్వ విప్ పీఆర్కే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, జెడ్పీటీసీ సభ్యుడు పెద మల్లుస్వామి, సర్పంచ్ ఎ.వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పచ్చిపాల శ్రీను, సబావత్ రవి నాయక్, రమావత్ చిన బాలు, జటావత్ రంగా, భీముడు, బాణావత్ స్వామి, జాలా అంజి, పంగా రమేష్, రమావత్ రంగా తదితరులున్నారు.



ప్రభుత్వ విప్ పీఆర్కేని సన్మానిస్తున్న పార్టీలో చేరిన వారు

దసరా నాటికి మరో 1205 మందికి ఇళ్ల పట్టాలు

సేకరించిన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: దసరా నాటికి పురపాలక పరిధిలోని మరో 1205 మందికి రెండో ఫేజ్ జగనన్న కాలనీ ఇళ్లపట్టాలు అందజేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి చెప్పారు. మంగళవారం మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి మండలంలోని ఇక్కుర్రు గ్రామ పరిధిలో జగనన్న కాలనీ రెండో ఫేజ్ లబ్ధిదారుల కోసం సేకరించిన 27.5ఎకరాల భూమిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ భూమిలో మెయిన్‌రోడ్డు నుంచి 60 అడుగుల రోడ్డు, లోపల రోడ్లు వేస్తున్నారన్నారు.

అనంతరం ప్లాట్లుగా సరిహద్దు రాళ్లు వేయించి దసరా నాటికి వాటిని అందజేస్తామన్నారు. గతంలో ఉప్పలపాడు జగనన్న కాలనీలో స్థలాలు లభించని వారికి, ఇప్పటికే 90రోజుల్లో ప్లాట్లు అందజేయాల్సిన వారికి కలిపి అందరికీ అందజేస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే వారికి వచ్చే జనవరి నాటికి అందజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈలోగా అన్నింటిని ఆన్‌లైన్ చేస్తామన్నారు. ఇంకా ప్రభుత్వ భూమిని ఎంపిక చేస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ జి.రామ్మోహన్, ఎంఈ కనకారావు, డీఈ శ్రీనివాసరావు, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, సర్వేయర్లు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఇళ్ల స్థలాల కోసం సేకరించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నేటి నుంచి పెదకాకాని శివాలయంలో పవిత్రోత్సవాలు

మూడు రోజులపాటు నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం

పెదకాకాని: శివాలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావులు తెలిపారు. ఈనెల 11వ తేది నుంచి 13వ తేదీ వరకూ మూడు రోజుల పాటు శైవాగమభీష్మ, నవశతాధిక ప్రతిష్ఠాపనాచార్య బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి మృత్యుంజయ ప్రసాద శివాచార్య వారి ప్రధానాచర్యత్వములు నిర్వహించడం జరుగుతుందన్నారు. గురువారం 10:59 గంటలకు దేవతామూర్తులకు పవిత్రాలు సమర్పణ జరుగుతుందన్నారు. తెనాలి పట్టణ వాస్తవ్యులు నేలవెల్లి కోటేశ్వరి కుటుంబం ద్రవ్య సహకారంతో ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పవిత్రోత్సవాలు తొలిరోజు మంగళవారం ఉదయం 7 గంటలకు చతుర్వేదపారాయణ, 8 గంటలకు పవిత్రాలు గల వెదురు పేటికలతో ఆలయ యజ్ఞశాల ప్రదక్షిణ పూర్వకంగా యాగశాల ప్రవేశం శివానుజ్ఞ శ్రీ విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యపూజ, ప్రాశన, రక్షాసూత్రపూజ, ధారణ, ఋత్విగర్వరణ, దీక్షాధారణ, అఖండ దీపస్థాపన, యాగేశ్వర కుంభస్థాపన, పూజ, వాస్తు కుంభస్థాపన, పూజ, వాస్తు శాంతిహోమం, బలి, పర్యాగ్నికరణ, బలిహరణ, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. సాయంత్రం 5 గంటలకు మృత్సంగ్రహణంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు మూడు రోజుల పవిత్రోత్సవాల పూజల్లో పాల్గొని స్వామివారి కృపాకటాక్షములకు పాత్రులు కావాలని ఆలయ ఏసీ ఎస్.శ్రీనివాసరెడ్డి కోరారు.



పెదకాకాని శివాలయం

చిన్న సినిమాల విడుదలకు థియేటర్లు ఇవ్వాల్సిందే

తెనాలి: సెన్సార్ బోర్డు సర్టిఫై చేసిన ప్రతి సినిమా విడుదలకు తెలుగు రాష్ట్రాల్లోని థియేటర్లలో విడుదలకు అనుమతి ఇవ్వాల్సిందేనని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా స్పష్టంచేశారు. సినిమా అనేది వ్యాపారం అయినప్పటికీ మానవతా దృక్పథంతో పరిశీలించి అమలుకు తోడ్పడాల్సిందిగా ఆయన తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు విజ్ఞప్తిచేశారు. మంగళవారం స్థానిక మా-ఏపీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అంబటి మధుమోహనకృష్ణతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో 1097 థియేటర్లు, తెలంగాణలో 485 థియేటర్లు ఉన్నప్పటికీ ఇప్పటికే ఎన్నో చిన్న సినిమాలు విడుదలకు నోచుకోవటం లేదన్నారు. దేశంలోని అత్యధిక థియేటర్లు ఏపీలో ఉన్నప్పటికీ ఇలాంటి పరిస్థితులు నెలకొనటం దురదృష్టకరంగా చెప్పారు. నెలలో మూడు వారాలు పెద్ద సినిమాలకు, ఒక వారం చిన్న సినిమాలకు అవకాశం ఇవ్వాలని ఆయన సూచించారు. కొందరు ప్రముఖుల చేతుల్లోనే థియేటర్లు ఉన్నందున, వారితో సంప్రదింపులతో సమస్య పరిష్కారానికి చలనచిత్ర అభివృద్ధి సంస్థలు కృషిచేయాల్సి ఉందన్నారు. అంబటి మధుమోహనకృష్ణ మాట్లాడుతూ సినిమాను విడుదల చేసుకోలేని అశక్తతతో చిన్న నిర్మాతలు మానసిక క్షోభకు గురవుతున్నారని చెప్పారు. చిన్న సినిమాకు ప్రేక్షకాదరణ ఉంటే, థియేటర్లో నడుస్తుందని లేకుంటే వేరే సినిమాను ప్రదర్శించుకునే వెసులుబాటు ఎటుతిరిగి ఉంటుందని చెప్పారు. వీరితో నటులు మిలటరీ ప్రసాద్, అమీర్‌చౌదరి ఉన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఈఓ రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఈఓగా నియమితులైన కాళహస్తి ఆర్డీఓ కె.ఎస్.రామారావు మంగళవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు ఆలయ ఏఈఓ చంద్రశేఖర్, ఆలయ వైదిక కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం రామారావును వేద పండితులు ఆశీర్వదించగా, ఏఈఓ చంద్రశేఖర్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదా లను అందజేశారు.

అనంతరం పాత మెట్ల సమీపంలోని ఈఓ చాంబర్‌కు చేరుకున్న కె.ఎస్.రామారావు, దసరా ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న దేవదాయ శాఖ స్పెషల్ సీఎస్ కరికాలవలవన్‌ను కలుసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె.రాణా, అధికారులతో కలిసి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ట్రిపుల్ ఎస్ పథకం ద్వారా ఆడ దూడల జననం

అద్దంకి: పెయ్య దూడల ఉప్పత్తి పథకం ట్రిపుల్ ఎస్ (సెక్స్ సార్టెడ్ సెమన్) ద్వారా గేదెలు ఆడ దూడలు ఈనినట్లు పశుసంవర్ధక శాఖ అద్దంకి ఏడీ మోహనరావు చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా నూటికి నూరు శాతం పెయ్యదూడలు మాత్రమే పుట్టే విధంగా సెమన్ (వీర్యం)ను పశుసంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం తయారు చేయించి పశుపోషకులకు అతి తక్కువ ధరకే అందించిందన్నారు. మండలంలోని 20 గేదెలకు ఈ సెమన్‌ను ఇవ్వగా మొదటగా పట్టణంలోని గొర్లమిట్టకు చెందిన నరిశెట్టి శ్రీనివాసులు, నర్రావారిపాలేనికి చెందిన నర్రా శ్రీనివాసులు గేదెలు ఆడ దూడలను ఈనాయని చెప్పారు. పథకం విజయవంతమైనందని చెప్పారు. మిగిలిన గేదెలు కూడా ఆడదూడలనే ఈనుతాయనే నమ్మకం రైతులకు కలిగించామని చెప్పారు.



దూడను పరిశీలిస్తున్న ఏడీ మోహనరావు

సాగరతీరంలో పోలీసుల మాక్‌డ్రిల్



కోడూరు(అవనిగడ్డ): ఉగ్రవాదులు, తీవ్రవాదులు చొరబడినప్పుడు, వారి ఆచూకీని కనిపెట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై మండలంలోని హంసలదీవి సాగరతీరం వెంట పోలీసులు మంగళవారం మాక్‌డ్రిల్ చేపట్టారు. డిఫెన్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తీరంలో సాగర్ కవచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ కె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో పాలకాయతిప్ప మెరైన్ సీఐ పవన్‌కిషోర్ పర్యవేక్షణలో 150 మంది పోలీసులు కోడూరు, నాగాయలంక మండలాల్లోని తీరప్రాంత గ్రామాల్లో పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. ఉగ్రవాదులు, తీవ్రవాదుల రూపంలో కోస్ట్‌గార్డు సిబ్బంది గ్రామాల్లోకి చొరబడగా, వారిని గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక పడవల ద్వారా సముద్రమార్గం వెంట సంచరించారు. సముద్రంలో వేటాడుతున్న పడవులను తనిఖీ చేశారు. పాలకాయతిప్ప, హంసలదీవి, ఉల్లిపాలెం, రామకృష్ణాపురం గ్రామాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేయడంతో పాటు అపరచితల వ్యక్తుల వివరాలను సేకరించారు. వేటకు వెళ్లిన మత్స్యకారుల ఐడీ కార్డులను పరిశీలించడంతో పాటు వారికి కూడా అనుమానితులను గుర్తించే ప్రక్రియపై అవగాహన కల్పించారు. బుధవారం కూడా ఈ మాక్‌డ్రిల్ కొనసాగుతుందని సీఐ తెలిపారు.

ఆటో డ్రైవర్‌లకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

- రూ.10వేల ఆర్థిక సాయంతో డ్రైవరన్నలకు భరోసా
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు



ఆటో డ్రైవర్‌లు నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటోల డ్రైవర్‌లు

రేపల్లె: ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలు చేర్చుతూ తమ బతుకు బండిలాగడానికి ఇబ్బందులు పడుతున్న డ్రైవర్ అన్నకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. వైఎస్సార్ వాహన మిత్రలో లబ్ధి పొందిన ఆటో డ్రైవర్‌ల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటరులోని ఆటోస్టాండ్ వద్ద మంగళవారం నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదోసారి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.275.93 కోట్లు నేరుగా వారి ఖాతాలలో జమ చేశారన్నారు. నేటి వరకు ఒక్కొక్క ఆటో డ్రైవర్ రూ.50వేల ఆర్థిక సాయం పొందారని గుర్తుచేశారు. ఆటో డ్రైవర్‌లు తమ వాహనాలను ఇన్స్యూరెన్స్‌లు చేయించుకోవటంగాని, మంచి కండీషన్‌లో ఉంచుకునేందుకు ఈ మొత్తం ఉపయోగించుకోవచ్చన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ఉపకారానికి నిరంతరం అండగా ఉండాలని, జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. ఆటో డ్రైవర్‌లు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తొలుత బస్టాండ్ సెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాంపట్నం నుంచి ప్రారంభమైన ర్యాలీ రేపల్లె పట్టణంలోని పార్టీ కార్యాలయం వరకు సాగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆటోడ్రైవర్‌లు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది

రేపల్లె: ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పిస్తుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో పట్టణంలోని సీతారామయోగిని కల్యాణ మండపంలో ఎస్సీ, ఎస్టీ యువతకు పరిశ్రమలపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. పరిశ్రమలకు అనువుగా ఉన్న ప్రాంతాలలో పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ నేషనల్ ప్రెసిడెంట్ డేవిడ్ బెర్నార్డ్ పాల్గొని ఎస్సీ, ఎస్టీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ నేషనల్ బాపట్ల జిల్లా అధ్యక్షుడుగా రెబ్బా భూషణరావు ఎన్నుకున్నారు. సమావేశంలో పలువురు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా పోలీస్ క్యాంప్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ఐసీసీ వన్డే క్రికెట్ ప్రపంచ కప్ జరుగుతున్న తరుణంలో క్రికెట్ బెట్టింగ్ ముఠాలు అమాయక ప్రజలను మోసం చేసే అవకాశం ఉందని అన్నారు. వారి మాయలో పడి యువత బెట్టింగ్ ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందని అన్నారు. బెట్టింగ్ ముఠాలపై నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలన్నారు. రౌడీలు, సస్పెక్ట్‌లపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. వారు నేరాలకు పాల్పడకుండా ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. జిల్లాలోకి గంజాయి, డ్రగ్స్ ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల దర్యాప్తులో ప్రధానమైన కేసుల్లో నిందితులకు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్న చీరాల పట్టణ–2 పోలీస్‌స్టేషన్ సీఐ జి.సోమశేఖర్, చీరాల రూరల్ సర్కిల్ సీఐ ఎ.మల్లికార్జునరావు, చీరాల పట్టణ–2 పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాసరావు, ఐటీ కోర్, డీసీఆర్‌బి విభాగాల్లో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లు డి.సురేష్, శివప్రసాద్‌లను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, బాపట్ల, చీరాల, రేపల్లె డీఎస్పీలు టి.వెంకటేశ్వర్లు, ఎస్.ప్రసాదరావు, టి.మురళీకృష్ణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఏవీ రమణ, ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, ఎస్‌బీ సీఐ వి.సూర్యనారాయణ, డీసీఆర్‌బి సీఐ పి.బాలమురళీకృష్ణ, జిల్లాలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీతో భూముల రీ సర్వే

- పూర్తి అవగాహన ఏర్పరచుకోండి
- యంత్రాంగానికి జేసీ జి.రాజకుమారి దిశా-నిర్దేశం



మాట్లాడుతున్న జేసీ జి.రాజకుమారి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం భూముల సమస్యలు శాశ్వత పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి రీ సర్వే నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన రిజిస్ట్రేషన్ శాఖాధికారుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ రీ సర్వే భూములపై అధికారులు పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సంబంధిత ఆస్తులను సమీప గ్రామ, వార్డు సచివాలయాల్లోనే చేసుకోచవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ అయిన 20 నిముషాల్లోనే వెబ్‌ల్యాండ్‌లో సదరు వ్యక్తి వివరాలు చూసుకోవచ్చన్నారు. అంతే కాకుండా భూములు రిజిస్ట్రేషన్ అయిన వెంటనే నేరుగా పట్టాదారు పాస్ బుక్ ప్రింటింగ్‌కు వెళ్లి కక్షిదారుని ఇంటి చిరునామాకే వస్తుందన్నారు. కొన్ని భూములకు సబ్ డివిజన్ అవసరమన్నారు. ఉదాహరణకు ఒక వ్యక్తికి ఎకరా భూమి ఉంటే అందులో సగభాగం అమ్మాలనుకుంటే ముందుగా సబ్ డివిజన్ చేసుకోవాలని చెప్పారు. దీనివల్ల భవిష్యత్‌లో హద్దుల వివాదం, భూ వివాదాలు ఉండవని తెలిపారు.

ఎన్నో భూ సమస్యలకు పరిష్కారం

స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వందేళ్ల తర్వాత భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంతో చాలా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఇప్పటికే ఆధునిక పరిజ్ఞానంతో సామాన్యునికి సైతం అర్థమయ్యే విధంగా రీ సర్వే చాలా గ్రామాల్లో పూర్తి చేశారని తెలిపారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ శాఖ పూర్తి సహకారమందిస్తుందన్నారు. డీఆర్వో చంద్రశేఖరరావు, గుంటూరు, పల్నాడు జిల్లాల రిజిస్ట్రార్లు డి.శైలజ, ఏవీ ఆర్‌కే ప్రసాద్, సబ్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో కనీస వసతులు కరువు

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

మేదరమెట్ల: ప్రైవేటు పాఠశాలల్లో కనీస వసతులు లేకుంటే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించవద్దని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలోని అంగన్‌వాడీ, ప్రైవేటు పాఠశాలను ఆమె మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు తక్కువగా ఉన్నారని ఆ కేంద్రాన్ని మరో కేంద్రంతో కలిపి విధులు నిర్వహించాలని పీడీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందిస్తున్నారా లేదా అని తల్లులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని తమ్మవరం రోడ్డులోగల నాగార్జున స్కూల్‌ను పరిశీలించారు. స్కూల్‌లో కనీస సౌకర్యాలు కూడా లేనట్లు గుర్తించారు. విద్యార్థులు మాత్రం అధిక సంఖ్యలో ఉన్నా వారికి బాత్‌రూమ్‌లు లేవని, వర్షం కురిస్తే పిల్లలు తడిచేవిధంగా రేకుల షెడ్లు ఉన్నాయన్నారు. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులు కనీసం వారి విద్యార్హతలను తెలియజేసేందుకుగాని, బస్సుల ఫిట్‌నెస్ పత్రాలు కానీ లేవన్నారు. ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో ఎందుకు ఉంచలేదని వారిని ప్రశ్నించారు. పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓకు ఆమె సూచించారు. ఆమె వెంట మేదరమెట్ల జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం బీ.అంజయ్య, మహిళా పోలీసులు ఉన్నారు.

కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని ముప్పవరపు సరోజినమ్మ, రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా కబడ్డీ పోటీలకు జట్టును ఎంపిక చేశారు. 67వ ఎస్‌జీఎఫ్ అండర్- 14 బాల బాలికల కబడ్డీ పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థుల నుంచి జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శాంతమ్మ, పీఎంసీ చైర్మన్ కె.ఉమామహేశ్వరరావు, వైస్ చైర్మన్ నాగజ్యోతి, నియోజకవర్గ ఆటల పోటీల కో-ఆర్డినేటర్ బి.రమేష్‌బాబు, మండల కో-ఆర్డినేటర్‌లు ఎన్.రవి, ఎం.రవి, సాంబశివరావు, దాసరి భాస్కరరావు పాల్గొన్నారు.



ఎంపికైన జట్టుతో ఉపాధ్యాయులు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి సైబర్ నేరగాళ్ల బురిడీ

తోట్లవల్లూరు(పామర్రు): ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. ఆమె రూ.7.50 లక్షలు కొట్టేశారు. ఈ ఘటన కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. తోట్లవల్లూరు గ్రామానికి చెందిన ఓ యువతి(24) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. వర్క్ ఫ్రం హోంలో భాగంగా ఇంటి నుంచే విధులు నిర్వహిస్తోంది. గత ఆగస్టులో ఆమెకు టెలిగ్రామ్ యాప్‌లో ఓ యూ ట్యూబ్ లింక్ వచ్చింది. తాము పంపే వీడియోలను లైక్, సబ్‌స్క్రైబ్ చేస్తే నగదు వస్తుందని సైబర్ మోసగాళ్లు ఆమెను నమ్మించారు. ఆ యువతి వారు చెప్పినట్లే లైక్‌లు, సబ్‌స్క్రైబ్‌లు చేయటంతో కొంత నగదు చెల్లించారు. మరింత సంపాదించాలంటే తరువాత స్టేజీకి వెళ్లాల్సి ఉంటుందని, అలా వెళ్లాలంటే నగదు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు సూచించారు. మాయగాళ్ల మాయమాటలు నమ్మిన ఆ యువతి విడతల వారీగా రూ.7.50 లక్షలను ఆన్‌లైన్‌లో వారికి చెల్లించింది. వారి నుంచి స్పందన లేకపోవటంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.విశ్వనాథ్ తెలిపారు.

దుర్గమ్మ దసరా అలంకరణలకు రూ.3.80 లక్షల చీరల సమర్పణ




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరిగే దసరా ఉత్సవాల తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి జరిగే పది అలంకారాలకు అవసరమైన పది పట్టు చీరలను మంగళవారం భక్తులు దేవస్థానానికి సమర్పించారు. విజయవాడకు చెందిన వ్యాపారవేత్త రావాడ చిరంజీవరావు రూ.3.80 లక్షల విలువైన పది పట్టుచీరలను దేవస్థాన పాలక మండలి సభ్యుడు బుద్దా రాంబాబు చేతుల మీదగా దేవస్థానానికి అందజేశారు. దాత ఏటా దసరా ఉత్సవాల్లో అమ్మవారికి చీరలను సమర్పిస్తుంటారని, ఈ ఏడాది కూడా చీరలను అందజేశారని ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

వత్సవాయి(జగ్గయ్యపేట): ప్రమాదవశాత్తూ బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వత్సవాయి మండలం గోపినేనిపాలెం గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గోపినేనిపాలెం గ్రామానికి చెందిన దారావతు సోమ్లా(40) స్థానికంగా ఉన్న రైస్‌మిల్లులో రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. మిల్లులో పనిలేకపోవడంతో గ్రామానికి చెందిన మిర్చి తోటకు తడిపెట్టేందుకు కూలికి వెళ్లాడు. మోటార్‌కు ఉన్న ఫుట్‌బాల్ పైపునకు తాడుతో కట్టేందుకు బావిలోకి దిగే క్రమంలో ప్రమాదవశాత్తూ కాలుజారి నీటిలో పడ్డాడు. అక్కడే ఉన్న వారు తేరుకుని బావిలోకి దూకి రక్షించేందుకు ప్రయత్నించారు. అయితే అంతలోనే సోమ్లా ప్రాణాలు కోల్పోయాడు. ఎస్‌ఐ అభిమన్యు సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని బావి నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సాక్షి పల్నాడు

బుధవారం, 11, అక్టోబర్, 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 3007 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 526.00 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 6,097 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



పిడుగురాళ్ల: నాగుల గుడి దేవస్థానం నందు మంగళవారం శ్రీ సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు.

న్యూస్‌రీల్

13న ఈపీఎఫ్‌ఓ పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 13న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ కార్యాలయ వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు ఫిర్యాదులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని వివరించాయి. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించాయి. ro.guntur@epfindia.gov.inతో పాటు వాట్సాప్ నంబరు 94946 57469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్లు 0863-2344106, 2232921 నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు. అదే విధంగా వెబ్ ఎక్స్ ఐడీ 26420864069, పాస్‌కోడ్ epfo@1234 ద్వారా లాగిన్ కావాలని తెలిపారు. పీఎఫ్ పింఛన్‌దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ద్విభాషా పాఠ్య పుస్తకాలతో విద్యార్థుల సమగ్రాభివృద్ధి



గుంటూరు ఎడ్యుకేషన్: ద్విభాషా పాఠ్య పుస్తకాలు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి దోహదపడతాయని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకుడు షేక్ అబ్దుల్ ఘనీ పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను మంగళవారం సందర్శించిన అబ్దుల్ ఘనీ ఉర్దూ మాధ్యమంలో చదువుతున్న విద్యార్థినుల్లో అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ద్విభాషా పాఠ్య పుస్తకాలతో ఎంతో మేలు ఉంటుందని వివరించారు. మన బడి నాడు-నేడు ద్వారా ప్రభుత్వం సకల హంగులతో ఆధునికీకరించిన పాఠశాలలతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు పడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విద్యార్థులందరికీ చేరుకునే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు నూరుశాతం హాజరయ్యేలా చూడటంతో పాటు జగనన్న గోరుముద్ద ప్రతి ఒక్కరూ స్వీకరించేలా పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి, సీనియర్ ఉపాధ్యాయిని జుబేదా బేగం ఉన్నారు.

నేడు జెడ్పీలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా మహిళాభివృద్ధి-శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొననున్నారు.

రేపు 5కే రన్



గుంటూరు వెస్ట్ (క్రీడలు) : రాజు అండ్ రవి ఓపెన్ 5కే రన్ పోటీలు ప్రజలకు చాలా ఉపయోగమని డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియంలో మంగళవారం నరాలశెట్టి రవి కుమార్, మంతెన రాజుతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గురువారం ఉదయం ఈ పరుగు పోటీలు నిర్వహిస్తామన్నారు. దీనికి సంబంధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ పరుగును స్టేడియంలోనే ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు టౌన్ హాలులో బంగారు తల్లి కార్యక్రమం

నరసరావుపేట: స్థానిక టౌన్ హాలులో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు బంగారుతల్లి హిమోగ్లోబిన్ ప్రోగ్రెస్ కార్డు ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు సమాచార పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దీప్తి మంగళవారం వెల్లడించారు. దీనిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

అబ్బురం.. సాహసం

- ఆకట్టుకున్న పోలీస్ జాగిలాల విన్యాసాలు
- అభినందించిన రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత
- శిక్షణ ఇచ్చిన హ్యాండ్లర్లకు మెమెంటోలు



జాగిలాలకు శిక్షణ ఇచ్చిన హ్యాండ్లర్లకు మెమెంటోలు అందజేస్తున్న రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత

మంగళగిరి: ఏపీఎస్పీ బెటాలియన్ ఆవరణలో నిర్వహించిన పోలీస్ జాగిలాల సాహస విన్యాసాలు అబ్బురపరిచాయి. పాసింగ్ అవుట్ పరేడ్ డాగ్ స్క్వాడ్ (కెనైన్)తో నిర్వహించిన డెమో ప్రదర్శనలను తిలకించిన రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత ఎనిమిది నెలల్లో ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్న 21వ బ్యాచ్‌కు చెందిన ఐదు రకాల జాతుల 35 జాగిలాలు, 54 మంది డాగ్ హ్యాండ్లర్లను ప్రత్యేకంగా అభినందించారు. ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ ఆవరణలోని జాగిలాల శిక్షణ సెంటర్‌లో మంగళవారం ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ప్రదర్శనలో అద్భుత ప్రతిభ కనబరిచిన జాగిలాలకు, హ్యాండ్లర్లకు హోంమంత్రి తానేటి వనిత చేతుల మీదుగా మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఎక్స్‌ప్లోజివ్, ట్రాకర్, నార్కోటిక్ అంశాలలో శిక్షణ పొందిన జాగిలాలు ప్రదర్శించిన సాహస విన్యాసాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు బెల్జియం, మరిన్ని ఇతర దేశాల నుంచి ఈ జాగిలాలను తీసుకొచ్చినట్టు పోలీస్ అధికారులు తెలిపారు. నేర పరిశోధనలో జాగిలాలు కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు.





మంటలలో నుంచి దూకుతున్న జాగిలాలు



వాసన పసిగట్టి దుండగుడిని గుర్తించిన జాగిలాలు

యార్డుకు 33,097 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 33,097 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 32,057 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.9,500 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 26,000, తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది.

విద్యుత్ చోరులకు అపరాధరుసుం

- దాడులు చేసిన విజిలెన్స్ అధికారులు
- తొమ్మిది గ్రామాల్లో 3,026 సర్వీసుల తనిఖీ



దాడుల్లో పాల్గొన్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

నరసరావుపేట: విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల అధికారులు మంగళవారం నరసరావుపేట-డీ 3 సెక్షన్ పరిధిలోని అర్వపల్లి, కేశానుపల్లి, కొత్తపాలెం, కోటప్పకొండ, పాలపాడు, పమిడిపాడు, పెదరెడ్డిపాలెం, ఉప్పలపాడు, లింగంగుంట్ల గ్రామాల్లో విస్తృత తనిఖీలు చేశారు. డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.సూర్యప్రకాష్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 45 మంది అధికారులు, 1,325 మంది సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి 3,026 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 178 మందిని గుర్తించి రూ.7.92 లక్షల అపరాధ రుసుం విధించారు. వీరిలో మీటరు లేకుండా డైరెక్ట్‌గా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 12 మందికి రూ.0.13 లక్షలు, మీటరు ఉన్నా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ముగ్గురికి రూ.0.55 లక్షలు, అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర విభాగాల్లో విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరికి రూ.0.08 లక్షలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 161 మందికి రూ.7.16 లక్షల అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వినియోగదారులందరూ విధిగా తమ పరిధిలోని మీటర్లకు సీళ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. లేకుంటే రాతపూర్వకంగా అధికారులకు తెలియజేయాలన్నారు. ఎవరైనా చౌర్యానికి పాల్పడుతుంటే 94408 12263, 94408 12360, 94408 12361 నంబర్లకు నేరుగా కానీ, వాట్సాప్ ద్వారా గానీ సమాచారం ఇవ్వొచ్చన్నారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. దాడుల్లో డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎం.రవికుమార్, కె.రవికుమార్, వై.ఏడుకొండలు, కె.కోటేశ్వరరావు, ఆపరేషన్ ఏఈ ఆనందరావు పాల్గొన్నారు.

పోక్సో కేసులో పదేళ్ల జైలు శిక్ష

నరసరావుపేట: బాలికపై లైంగిక దాడి కేసులో నిందితునికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. పోలీసుల కథనం ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణంలోని పిల్లలగడ్డ కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలికను అదే ప్రాంతంలో నివాసముంటున్న షేక్ నాగూర్‌వలి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆ బాలిక తనను పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరించాడు. మోసపోయానని తెలుసుకున్న బాలిక తన తల్లిదండ్రుల సాయంతో పిడుగురాళ్ల పట్టణ పోలీస్‌స్టేషన్లో 2017 జూలై 27న ఫిర్యాదు చేసింది. అప్పటి పిడుగురాళ్ల పట్టణ సీఐ కె.హనుమంతరావు కేసు నమోదు చేసి కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను సేకరించి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. బాధిత బాలిక తరఫున కేసును వాదించి నిందితునికి శిక్ష పడటంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామల విశేష కృషిచేశారు. దీంతో పోలీసు సిబ్బందిని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామలను ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అభినందించారు.

నెల రోజుల్లో అగ్రహారం భూములపై రైతులకు హక్కులు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా, వేదికపై మాజీ ఎమ్మెల్యే మక్కెన తదితరులు


నూజెండ్ల మండలం అప్పాపురం రైతులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు భరోసా

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్ర చరిత్రలో అగ్రహారం భూములు సర్వే చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతోందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలం వి.అప్పాపురం గ్రామంలో మంగళవారం రాత్రి అగ్రహారం భూముల సర్వేపై ఏర్పాటు చేసిన సభలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో 18 వేల ఎకరాలకుపైగా అగ్రహారం భూములు సర్వేకు నోచుకోక రైతులు ఇబ్బందులు పడుతున్నారనే అసెంబ్లీలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేశానని చెప్పారు. రీసర్వేలో భాగంగా అగ్రహారం భూములు కూడా సర్వే చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని ఆమేరకు వెంటనే పనులు ప్రారంభించినట్లు చెప్పారు. నెలరోజుల్లో అప్పాపురం అగ్రహారం రైతులకు భూములపై హక్కులు కల్పిస్తామన్నారు. ఎంపీపీ జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జెడ్డా సుబ్బులు ఉరామయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, సొసైటీ చైర్మన్లు పొట్లపల్లి పిచ్చిరెడ్డి, పారావెంకటేశ్వర్లు, చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులు, తహసీల్దార్ మదుబాబు, పార్టీ నాయకులు, వెంకటేశ్వర రెడ్డి, ఒంగూరి ప్రసాదు, అంజిరెడ్డిలతోపాటు పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఇసప్పాలెంలో జిల్లా స్థాయి అర్చక గ్రీవెన్స్

నరసరావుపేట: ఏపీ అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని ఇసప్పాలెం శ్రీ మహంకాళీ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి అర్చక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు తూమాటి మురళి మంగళవారం తెలియచేశారు. దీనిలో దేవదాయశాఖ జిల్లా డీఈ (కమిషనర్)సత్యనారాయణరెడ్డి దృష్టికి తీసుకొచ్చిన సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తుందన్నారు.

మంగళగిరి చేరుకున్న క్రికెట్ జట్లు



మంగళగిరి: ఈ నెల 12వ తేదీ నుంచి 20 వరకు జరగనున్న బీసీసీఐ అండర్-19 పురుషుల క్రికెట్ పోటీల కోసం మంగళవారం మహారాష్ట్ర, ఢిల్లీ జట్లు నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి చేరుకున్నాయి. టోర్నీ నిర్వహణకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా రాష్ట్రాల జట్టు కెప్టెన్‌లు ఆర్.వఘేలా, కిరణ్ కార్మెల్, చీఫ్ కోచ్‌లు జస్వంత్ రాయ్, అజయ్ చౌహాన్ పర్యవేక్షణలో ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నారు.



ప్రతిపాదిత స్థలంలో నిర్మాణ పనుల ప్లాన్ పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

ఆధ్యాత్మిక కేంద్రంగా చిలకలూరిపేట

- పురుషోత్తమపట్నంలో రూ.2.50 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం
- రూ.75 లక్షలతో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాలు
- నిర్మాణాలకు ఐదు ఎకరాల భూమి కేటాయింపు
- దాతల వాటాగా రూ. 68.75 లక్షలు మా కుటుంబం చెల్లించింది
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి

చిలకలూరిపేట: గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా చిలకలూరిపేటను అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణ పరిధిలోని పురుషోత్తమపట్నంలో ఐదెకరాల దేవదాయశాఖ భూమిలో టీటీడీ కల్యాణ మండపం, వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు అతి త్వరలో ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని మంత్రి విడదల రజిని మంగళవారం పరిశీలించారు. అధికారులు స్థలానికి సంబంధించిన వివరాలు, నిర్మాణ పనుల వివరాలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు గ్రామంలోని కోదండరామస్వామి ఆలయానికి సంబంధించిన దేవదాయశాఖ భూములు పురుషోత్తమపట్నంలో ఐదెకరాలు ఉన్నాయని చెప్పారు. ఇక్కడే టీటీడీ కల్యాణ మండపం, వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ భూమిని దేవదాయ శాఖ నుంచి టీటీడీకి బదలాయిస్తూ ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని వెల్లడించారు. ఆ వెంటనే టీటీడీ పాలక మండలి ఆలయ నిర్మాణానికి రూ.75 లక్షలు, కల్యాణ మండప నిర్మాణానికి రూ. 2.50 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు డీడీలు అందజేత..

నిర్మాణాలకు సంబంధించి దాతల వాటాగా చెల్లించాల్సిన 20 శాతం నిధులు రూ.68.75 లక్షలను తమ కుటుంబం తరపున చెల్లించామని మంత్రి రజిని వివరించారు. టీటీడీ, శ్రీవాణి ట్రస్టుల పేరుతో తన భర్త కుమారస్వామి సంబంధిత డీడీలను చెల్లించారని పేర్కొన్నారు. తమ కుటుంబ సభ్యులు ఆ డీడీలను నాలుగు రోజుల కిందట తిరుమలకు వెళ్లి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డికి అందజేశారని వెల్లడించారు. అతి త్వరలో ఇక్కడ టీటీడీ కల్యాణ మండపం, వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వివరించారు. ఇదే పురుషోత్తమపట్నంలో ఏకంగా రూ.3 కోట్ల వ్యయంతో వేణుగోపీనాథస్వామి ఆలయాన్ని ఇప్పటికే నిర్మించినట్లు తెలిపారు. దీని కోసం ప్రభుత్వం నుంచి రూ.1.50 కోట్లు, టీటీడీ నుంచి మరో రూ.1.50 కోట్ల నిధులు వెచ్చించినట్లు వివరించారు. బొప్పూడి కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకూ ప్రభుత్వం నుంచి రూ.30 లక్షల వరకు ప్రత్యేక నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అదే గ్రామంలో కొండ కింద చెన్నకేశవస్వామి, శివాలయాల అభివృద్ధికీ రూ.కోటి మంజూరయ్యాయని తెలిపారు. కొండవీడు అభివృద్ధి పనుల్లో భాగంగా అత్యంత వైభవంగా, పురాతన కళ ఉట్టి పడేలా లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని తమ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని తెలిపారు. చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలో వెన్నముద్ద వేణుగోపాలస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకూ నిధులు మంజూరయ్యాయని వివరించారు.

నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయడంలో తన వంతు కృషి చేశానని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మాజీ చైర్మన్లు విడదల లక్ష్మీనారాయణ, బత్తినేని శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, నాయకులు తోట రామచంద్రప్రసాద్, బైరా వెంకటకృష్ణ, తోట బ్రహ్మస్వాములు, రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి. -520001.
Email: arb.vijayawada@unionbankofindia.bank

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం పూర్వపు ఆంధ్రాబ్యాంక్/ కార్పొరేషన్ బ్యాంక్ ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇప్పుడు ఈ ఖాతాలు అస్సెట్ రికవరీ బ్రాంచి, విజయవాడకు బదలాయించబడినవి.

... "ఎక్కడ ఏది ఉన్నదో అది", "ఏలా ఉన్నది అలా" మరియు "అక్కడ ఏది ఉంటే అది" ... యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ వారిచే ఇ-వేలం ద్వారా ది.27-10-2023 న ...

ఇ-వేలం తేది & సమయం : 27-10-2023, మధ్యాహ్నం 12.00 గం.ల నుండి సాయంత్రం గం.05.00 ల వరకు
ధరావత్తు సమర్పించుటకు ఆఖరు తేది : ఇ-వేలం ప్రారంభానికి ముందు వరకు

ఋణగ్రహీత(లు)/ సహహామీదారు(లు) / తనఖాదారు (లు)/ హామీదారు (లు), బకాయి మరియు రిజర్వు ధర , ధరావత్తు వివరములు దిగువ తెలుపబడినవి

1) ఋణగ్రహీత(లు)/ సహహామీదారు(లు) / తనఖాదారు (లు)/ హామీదారు (లు) : మెస్సర్స్ శ్రీ ... ఎంటర్‌ప్రైజెస్, ప్రొప్రయిటర్ : వేంకట ఏడుకొండలు, ... గుంటూరు-522001. ... 7. ... (హామీదారు), ... గుంటూరు-522002.
బకాయి మొత్తం : తేది.11-05-2021 నాటికి రూ.2,48,58,704.93 పై. ...

రిజర్వు ధర : రూ.73.40.000/-	ధరావత్తు : రూ.7.34.000/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.73.400/-
రిజర్వు ధర : రూ.14.80.000/-	ధరావత్తు : రూ.1.48.000/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.14.800/-
రిజర్వు ధర : రూ.11.09.000/-	ధరావత్తు : రూ.1.10.900/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.11.090/-
రిజర్వు ధర : రూ.27.72.000/-	ధరావత్తు : రూ.2.77.200/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.27.720/-
రిజర్వు ధర : రూ.42.69.000/-	ధరావత్తు : రూ.4.26.900/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.42.690/-
రిజర్వు ధర : రూ.39.64.000/-	ధరావత్తు : రూ.3.96.400/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.39.640/-
రిజర్వు ధర : రూ.11.47.000/-	ధరావత్తు : రూ.1.14.700/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.11.470/-

2)

రిజర్వు ధర : రూ.10.94.000/-	ధరావత్తు : రూ.1.09.400/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.11.000/-
రిజర్వు ధర : రూ.10.94.000/-	ధరావత్తు : రూ.1.09.400/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.11.000/-
రిజర్వు ధర : రూ.10.94.000/-	ధరావత్తు : రూ.1.09.400/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.11.000/-
రిజర్వు ధర : రూ.10.94.000/-	ధరావత్తు : రూ.1.09.400/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.11.000/-

3)

రిజర్వు ధర : రూ.71.06.000/-	ధరావత్తు : రూ. 7.10.600/-	బిడ్ పెంపుదల మొత్తం : 71.060/-

4)

బకాయి మొత్తం: ది.02.07.2018 నాటికి రూ.17,51,99,122/- (అక్షరాల పదిహేడు కోట్ల యాభై ఒక్క లక్షల తొంభై తొమ్మిది వేల నూట ఇరవై రెండు రూపాయలు మాత్రమే) మరియు ఒప్పంద రేటుపై తదుపరి వడ్డీతో పాటు మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి యొక్క వివరాలు: ఆస్తి నెం. 8: ... గుంటూరు జిల్లా, ... డి.నెం. 1208/4, పట్టా నెం. 1247 ... ఖాళీ స్థలము. ... 488.88 ... హద్దులు : తూర్పు : ... దక్షిణం : ... పడమర : ... ఉత్తరం : రోడ్డు, ... 8111/2016. కోఆర్డినేట్స్: లాటిట్యూడ్: 16.272296, లాంగిట్యూడ్: 80.460592

రిజర్వు ధర : రూ.37.40.000/-	ధరావత్తు : రూ. 3.74.000/-	బిడ్ పెంపుదల మొత్తం : 37.400/-

5)

రిజర్వు ధర : రూ.51.61.000/-	ధరావత్తు : 5.16.100/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.51.610/-

6)

రిజర్వు ధర : రూ.5.66.36.000/-	ధరావత్తు : 56.63.600/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.5.66.360/-
రిజర్వు ధర : రూ.63.36.000/-	ధరావత్తు : రూ.6.33.600/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.63.360/-
రిజర్వు ధర : రూ.55.00.000/-	ధరావత్తు : రూ.5.50.000/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.55.000/-

7)

రిజర్వు ధర : రూ.68.42.000/-	ధరావత్తు : రూ.6.84.200/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.68.420/-
రిజర్వు ధర : రూ.47.25.000/-	ధరావత్తు : రూ.4.72.500/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.47.250/-

8)

రిజర్వు ధర : రూ.1.38.67.325/-	ధరావత్తు : రూ.13.86.733/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.1.38.673/-

9)

రిజర్వు ధర : రూ.1.09.03.000/-	ధరావత్తు : రూ.10.90.300/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.1.09.030/-
రిజర్వు ధర : రూ.34.20.000/-	ధరావత్తు : రూ.3.42.000/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.34.200/-
రిజర్వు ధర : రూ.93.96.000/-	ధరావత్తు : రూ.9.39.600/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.93.960/-
రిజర్వు ధర : రూ.25.65.000/-	ధరావత్తు : రూ.2.56.500/-	బిడ్ పెంపుదల మొత్తం : రూ.25.650/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ : www.unionbankofindia.co.in నందు చూడగలరు. ... ఆస్తి పరిశీలన కోసం Mail ID : arb.vijayawada@unionbankofindia.bank లో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు
... సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6)/రూలు 9(1) క్రింద ... నోటీసుగా పరిగణించవలెను.

తేది : 06-10-2023, ప్రదేశం : విజయవాడ | సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచ్, విజయవాడ